

## మహా కుంభమేళాలో అఖండ తాండవం

అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి చిత్రాలతో హ్యాట్రిక్ విజయాలను అందుకొని, రీసెంట్‌గా 'డాకు మహారాజ్'తో డబుల్ హ్యాట్రిక్‌కు శ్రీకారం చుట్టారు నందమూరి బాలకృష్ణ. ప్రస్తుతం ఆయన నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'అఖండ తాండవం'. బ్లాక్‌బస్టర్ 'అఖండ'కు సీక్వెల్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. 14 రీల్స్ పతాకంపై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రానికి నందమూరి తేజస్విని సమర్పకురాలు. ఈ చిత్రం షూటింగ్ ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక వేడుక అయిన మహా కుంభమేళాలో ఈ రోజున ఘనంగా మొదలైంది. కీలకమైన సన్నివేశాలను కుంభమేళాలో చిత్రీకరిస్తున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఈ సీక్వెల్‌పై భారీ అంచనాలు ఉన్నాయని, దానికి తగ్గట్టే పానిండియా స్థాయిలో చిత్రాన్ని నిర్మిస్తున్నామని మేకర్స్ తెలిపారు. ప్రగ్యా జైస్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సంజయ్‌దత్ విలన్‌గా నటించనున్నట్టు వార్తలొస్తున్నాయి. ఈ చిత్రానికి కెమెరా: సి.రాంప్రసాద్, సంతోష్ డి డెటాకే, సంగీతం: థమన్ ఎస్.



## కార్ రేసింగ్‌లో సత్తా చాటిన అజిత్

దుబాయ్‌లో జరిగిన 24హెచ్ కారు రేసింగ్‌లో తమిళ అగ్ర నటుడు అజిత్ సత్తా చాటారు. 'అజిత్‌కుమార్ రేసింగ్' పేరుతో ఇటీవల ఒక రేసింగ్ టీమ్‌ని అజిత్ ప్రకటించారు. తాజాగా దుబాయ్ వేదికగా ఆదివారం హోరాహోరీగా సాగిన కారు రేసింగ్‌లో అజిత్ జట్టు మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నది. ఈ ఆనందాన్ని తన కుటుంబ సభ్యులతో పంచుకున్నారు అజిత్. తన భార్య షాలినికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'రేసులో పాల్గొనేందుకు అనుమతినిచ్చినందుకు నీకు ధన్యవాదాలు షాలు..' అంటూ తన భార్య షాలినిని అజిత్ హత్తుకున్నారు. ఈ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. కార్, బైక్ రేసులను అమితంగా ఇష్టపడతారు అజిత్. అయితే.. గత కొన్నాళ్లుగా ఆయన వాటికి దూరంగా ఉంటూ వచ్చారు. ఇప్పుడు మళ్లీ ఆయన మనసు రేసింగ్‌లపై మళ్లింది. అందుకే.. తన స్పోర్ట్స్ కార్‌ని మళ్లీ ట్రాక్ ఎక్కించారు. దుబాయ్ కార్ రేసింగ్ కోసం సన్నద్ధమవుతూ ఇటీవలే ఆయన ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఆ ప్రమాదంలో కారు ముందు భాగం ఛిద్రమవ్వగా, అజిత్ మాత్రం గాయలపాలవ్వకుండా బయట పడ్డారు. ఆ ప్రమాదం జరిగిన రెండు రోజులకు జరిగిన ఈ పోటీల్లో అజిత్ జట్టు మూడో స్థానంలో నిలవడం గమనార్హం. ఇదిలావుంటే.. ఈ ఘనత సాధించిన అజిత్‌కి ప్రపంచవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. రజనీకాంత్, పవన్‌కళ్యాణ్, ఉదయ్‌నిధి స్టాలెన్, సమంతలతోపాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు అజిత్‌కు అభినందనలు తెలిపారు.

### అజిత్‌కు కేటీఆర్ అభినందన

> అద్భుతమైన ఫలితమది.. గొప్ప లక్ష్యం, దాన్ని సాధించాలన్న ఉత్సుకత, సంకల్పానికి ఈ విజయం నిదర్శనం. దేశానికే గర్వకారణమైన ఘనత ఇది. కంగాట్స్ అజిత్‌గారు..

## నవ్వులా మజాకా



'థమాకా'తో వంద కోట్ల విజయాన్ని అందుకున్న దర్శకుడు నక్కిన త్రినాథరావు ఫిబ్రవరి 11న 'మజాకా'తో రానున్నారు. సందీప్ కిషన్ కథానాయకుడు. రాజేష్ దండా, ఉమేష్ కెఆర్ బన్సాల్ నిర్మాతలు. ప్రమోషన్‌లో భాగంగా హైదరాబాద్‌లో ఈ సినిమా టీజర్‌ని ఘనంగా విడుదల చేశారు. సందీప్‌కిషన్, రీతువర్మ వైజాగ్ ఆర్కే బీచ్‌లో డ్రింక్ చేస్తూ పోలీసులకు పట్టుబడటంతో టీజర్ మొదలైంది. అది వారి అరెస్ట్‌కు దారితీయడం, తద్వారా వారిమధ్య ఏర్పడిన కలహం ప్రేమగా పరిఢమిల్లడం ఈ టీజర్‌లో చూడొచ్చు. సందీప్ తండ్రిగా రావురమేష్ కనిపించారు. ఆయనకు కూడా ఓ ప్రేమకథ ఉన్నట్టు టీజర్ చెబుతున్నది. తండ్రీ కొడుకుల కెమిస్ట్రీ ఈ టీజర్‌లో హైలైట్. మొత్తంగా వినోదాత్మక చిత్రమని ఈ టీజర్ చెప్పకనే చెబుతున్నది. దర్శకుడు త్రినాథరావు, రచయిత ప్రసన్న నిజాయితీగా పనిచేస్తారని, త్రినాథరావు దర్శకత్వంలో నటించాలనే కోరిక ఇన్నాళ్లకు తీరిందని, భైరవకోన, రాయన్ విజయాల తర్వాత తన నుంచి వస్తున్న సినిమా ఇదని హీరో సందీప్‌కిషన్ చెప్పారు. ఈ కథే అందరినీ ఎంచుకున్నదని, ప్రసన్న అద్భుతమైన కామెడీ రాశారని, సందీప్ గొప్పగా నటించారని, 'మన్మథుడు'ఫేం అన్షూ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నదని, కుటుంబసమేతంగా ఎంజాయ్ చేసే సినిమా ఇదని నక్కిన త్రినాథరావు తెలిపారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.

## ఆధ్యాత్మిక సాహస యాత్ర



అనంత పద్మనాభస్వామి, పూరీ జగన్నాథ్ దేవాలయాల్లో కనుగొనబడిన గుప్త నిధుల వృత్తాంతం నుంచి ప్రేరణ పొంది ఆధ్యాత్మిక సాహసోపేత ఇతివృత్తంతో తెరకెక్కుతున్న భారీ పాన్‌ఇండియా చిత్రం 'నాగబంధం'. 'ది సీక్రెట్ ట్రెజర్' అనేది ఉపశీర్షిక. విరాట్ కర్ణ ప్రధాన పాత్రధారి. అభిషేక్ నామా రచన, దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి కిశోర్ అన్నపురెడ్డి నిర్మాత. ప్రస్తుతం నిర్మాణదశలో ఉన్న ఈ చిత్రం ఈ ఏడాదిలోనే విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. రానా దగ్గుబాటి పోస్టర్‌ని ఆవిష్కరించి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. సముద్రంలో భయంకరమైన మొసలితో పోరాడుతూ.. ఫెరోషియస్‌గా రగ్గడ్ అవతారంలో సాలిడ్ ఫిజిక్‌తో విరాట్ కర్ణ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నాడు. ఒక ఎపిక్ అడ్వెంచర్‌గా ఈ చిత్రం రూపొందుతున్నదని, ఆధ్యాత్మికతతో కూడిన ఉత్కంఠభరిత సాహసయాత్రగా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ తెలిపారు.







